# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 281 | విశాఖపట్నం | 11-7-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 281 | VISAKHAPATNAM | 11-7-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | Pay



Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram


## అభ్యంతరకర వ్యాఖ్యలను ఉపేక్షించొద్దు

### పోలీస్ శాఖకు చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ ఆదేశం



**అమరావతి, పతాకం న్యూస్:** సోషల్ మీడియా అంశంపై ఏపీ కేబినెట్‌లో సీరియస్‌గా చర్చ జరిగింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షత కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాపై డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం వెంటనే టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను మంత్రిమండలి ఆదేశించింది. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించింది. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా కొత్తగా పీపీలను నియించుకోవాలని ఏపీ కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వంపై అభూత కల్పనలు, అసత్యాలు, అసలు విషయాలు వక్రీకరిస్తే మాత్రం ఉపేక్షించవద్దని మంత్రు గట్టిగా కోరినట్లు తెలుస్తోంది. ఈరోజు నుంచే సోషల్ మీడియాపై పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే సోషల్ మీడియాపై ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీలో కూడా చర్చించాలని ఆదేశించింది. వైసీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి దృష్టి మరల్చేందుకు కొత్త పద్ధతి ఎన్నుకున్నారని మంత్రులకు సీఎం చంద్రబాబు చెప్పారు. వారు కావాలని ఎమ్మెల్యేలను రెచ్చగొడుతున్నారని... వైసీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సూచించారు.



## వేధిస్తున్న నిధుల కొరత!

### అభివృద్ధికి నోచుకోని చెరువులు, గెడ్డలు

**టెక్కలి, పతాకం న్యూస్:** టెక్కలి నియోజకవర్గంలో చిన్నతరహా నీటి పారుదల శాఖకు నిధుల కొరత వేధిస్తోంది. ఏడేళ్లుగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. దీంతో ఆ శాఖ పరిధిలోని చెరువులు, గెడ్డలు, వాగులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. టెక్కలి పరిధిలో 214 చెరువులు, నందిగాంలో 384, సంతబొమ్మాళిలో 189, కోటబొమ్మాళి పరిధిలో 240 చెరువులు ఉన్నాయి. అదేవిధంగా మాలపేటగెడ్డ, దుర్గగెడ్డ, గరీబుల గెడ్డ, బొప్పాయిపురం, సండెమ్మ, భీంపురం, కాంత్రగడ తదితర గెడ్డలు ఉన్నాయి. గత ఏడేళ్లుగా పట్టించుకోకపోవడంతో వీటి రూపురేఖలు మారిపోయాయి. పిచ్చిమొక్కలు, పూడికతో గెడ్డలు నిండిపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. ఇవి బాగుపడాలంటే మైనర్ ఇరిగేషన్‌కు నిధులు అవసరం. కానీ, ఒక్క రూపాయి కూడా లేకపోవడంతో కనీసం చెరువుల వద్ద పడిన గండ్లు కూడా పూడ్చలేని దుస్థితి నెలకొంది. 2018 వరకు నీరు-చెట్టు కింద జరిగిన పనులు మినహా ఆ తరువాత ఎలాంటి అభివృద్ధి మైనర్ ఇరిగేషన్ శాఖలో జరగలేదు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. సీడీఆర్ నిధులు గానీ, మరే ఇతర నిధులు గానీ మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ నియోజకవర్గానికి రూ.3కోట్లు చొప్పున కేటాయించింది. అయితే, టెక్కలి నియోజకవర్గం పరిధిలో మేజర్ ఇరిగేషన్‌కే ఆ నిధులు కేటాయించారు తప్పా మైనర్ ఇరిగేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఇటీవల జరిగిన ఇరిగేషన్ ఎడ్వైజరీ బోర్డు సమావేశంలో రూ.35కోట్లు అవసరమని చిన్న నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ ఏడాది మైనర్ ఇరిగేషన్‌లో టెక్కలి నియోజకవర్గానికి పూర్తిగా మొండిచేయి చూపగా, జిల్లాలో ఇతర (తరువాయి 2వ పేజీలో)



5లో

### శరవేగంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఏడో ప్యాకేజీ పనులు

### బీహార్‌లో నకిలీ సర్టిఫికెట్లతో కొలువులు పొందిన 3,035 మంది ఉపాధ్యాయుల తొలగింపు!



6లో



6లో

### ప్రసవానంతరం మహిళలకు ఏయే సమస్యలు ఉంటాయి?

### 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో ప్రధాని మోడీకి ఘనస్వాగతం



**న్యూజిలాండ్:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా శుక్రవారం న్యూజిలాండ్‌లో అడుగుపెట్టారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలను ముగించుకుని ఆయన శుక్రవారం ఆక్లాండ్‌కు చేరుకున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల విరామం తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టఫర్ లక్సన్ స్వయంగా మోదీకి సాదర స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని మోదీ, లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ భేటీలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

## సియోల్‌లో కొరియా ఆటో పరిశ్రమ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ



**దక్షిణ కొరియా:** ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో దేశానికే హబ్‌గా మార్చేందుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళుతున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన "సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0" కింద రాష్ట్రంలో విస్తృతమైన ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని కొరియన్ సంస్థలను ఆయన ఆహ్వానించారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్, సియోల్‌లో కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ (కేఏఐసీఏ) ఛైర్మన్ టేక్-సుంగ్ లీ నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈవీ ఎకోసిస్టమ్‌లో భాగంగా పూర్తిస్థాయిలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులను విద్యుదీకరించడం, గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం, పుంగనూరులో ప్రత్యేక ఈవీ క్లస్టర్‌ను నెలకొల్పడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

### డ్రగ్స్ కలకలం.. ఐదుగురు ముఠా సభ్యుల అరెస్ట్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ అత్తాపూర్‌లో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మహా నగరంలో డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ ఎస్‌వోటీ బృందం, అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడుల్లో ఒక ప్రమాదకర డ్రగ్స్ ముఠా గుట్టురట్టయింది. అత్తాపూర్ పరిధిలో యథేచ్ఛగా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు నిందితులు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యారు.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఎల్‌నినో ప్రభావం..

ప్రస్తుతం వాతావరణ శాస్త్రవేత్తలు, అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఎల్నెనో గురించే తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. 2026మధ్య నాటికి పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు చాలా వేగంగా పెరుగుతుండటంతో, ఈ ఏడాది సాధారణ ఎల్నెనో కంటే ప్రమాదకరమైన 'సూపర్ ఎల్నినో' అంటే అత్యంత బలమైన ఎల్నినో ఏర్ప డే అవకాశాలు 60శాతం పైగా ఉ న్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ, అమెరికాకు చెందిన ఎన్ఐఎఎ హెచ్చరిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రత సగటు కంటే 2లేదా అంతకంటే ఎక్కువ పెరిగితే దానిని 'సూపర్ ఎల్నెనో' లేదా 'వెరీ స్ట్రాంగ్ ఎల్నెనో' అని పిలుస్తారు. గత 140 ఏళ్లలోనే ఇది అత్యంత శక్తివంతమైనదిగా మారే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. సూపర్ ఎల్సినో వల్ల ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి వేడి రానుంది. ఇప్పటికే గ్లోబల్ వార్మింగ్ వల్ల భూమి వేడెక్కుతోంది. దీనికి సూపర్ ఎల్సినో తోడైతే, 2026 ద్వితీయార్థం, 2027 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగిపోయి, తీవ్రమైన హీట్వేవ్స్ వీస్తాయి. సాధారణ ఎల్సినో వస్తేనే భారత్లో వర్షాలు తగ్గుతాయి. అదే సూపర్ ఎల్సినో వస్తే రుతుపవనాలు పూర్తిగా బలహీనపడి, దేశంలోని కేంద్ర, ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో తీవ్రమైన కరువు ఏర్పడే ప్రమాదం ఉంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, అమెజాన్ అడవు ల్లో పిడుగులు, అడవి మంటలు పెరిగే అవకాశం ఉంది. అలాగే భారత్తో తోపాటు ఆసియాదేశాలలో వ్యవసాయ దిగు బడులు దారుణంగా పడిపోయి ఆహారకొరత ఏర్పడవచ్చు. ఎల్ నినోవల్ల ఒకవైపు కరవువస్తే, మరోవైపు తూర్పు ఆఫ్రికా, అమెరికాలోని కొన్ని ప్రాంతాలు, పెరూ, ఈక్వెడార్ వంటి దేశాలలో అసాధారణ భారీవర్షాలు, వినాశకరమైన వరదలు ముంచెత్తుతుంటాయి. పసిఫిక్ మహాసముద్రంలో గాలి దిశలు వేగంగా మారుతున్నాయి. అక్కడ ఏర్పడిన కొన్ని అసాధారణ తుఫానుల వల్ల వేడి నీరు తూర్పు వైపునకు నెట్టబడుతోంది. దీనివల్ల ఎల్నెనో తీవ్రత రోజురోజుకూ బలపడుతోంది. వాతావరణ నిపుణుల ప్రకారం రాబోయే ఆగస్టు, నవంబర్ అత్యంత కీలకంగా భావిస్తున్నారు. ఈ సూపర్ ఎల్నినో గనుక పూర్తిస్థాయిలో విజృంభిస్తేప్రపంచ ఆర్థికవ్యవస్థ, వ్యవసాయ రంగంపై దీని ప్రభావం చాలా కాలం పాటు ఉంటుందని ఆహార నిపుణులు ఆందోళనకు గురవుతున్నారు. ఎల్నినో ప్రభావం భారత ఆహార ఉత్పత్తి రంగంపై ఖచ్చితంగా పడనుంది. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం అంటే దాదాపు 92శాతం వరకూ నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తం ఆహారఉత్పత్తిలో దాదాపు 40ఖరీఫ్ సీజన్ నుంచే వస్తుంది. వర్షాలు సకాలంలో పడకపోతే, లేదా తక్కువగా ఉంటే ప్రధాన ఖరీఫ్పంటలైన వరి, పప్పుధాన్యాలు, సోయాబీన్, జొన్నలు, మొక్క జొన్న, పత్తిసాగుపై తీవ్రప్రభావం పడుతుంది. అదిరాబోయే రోజుల్లో ఆహార సంక్షోభానికి కారణం అవుతుంది. వర్షాలు తక్కువగా పడటంవల్ల నదులు, డ్యా మ్లలో నీటి మట్టాలు పడిపోతాయి. ఇప్పుడు వర్షాలు పడకపోతే చాలామటుకు రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరవచ్చు. రిజర్వాయర్ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ కూడా తగ్గుతుంది. ఖరీఫ్ ముగిసిన తర్వాత వచ్చే రబీ సీజన్ లో పండించే గోధుమలు, శనగలు, ఆవాలు వంటి పంటలకు జలాశయాల్లోని నీరే ప్రధాన ఆధారం. ఎల్నెనో ప్రభావంతో జలాశయాలు ఎండిపోతే రబీ పంటల దిగుబడి కూడా తగ్గుతుంది. వర్షాలు కుర వకుండా, ఎండలు ఎక్కువగా ఉంటే భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతుంది. ఆహార ఉత్పత్తి తగ్గితే మార్కెట్లో డిమాండ్కు సరిపడా సరఫరా ఉండదు. దీనివల్ల బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగే ప్రమా దం ఉంది. ఇది సామాన్యుల బడ్జెట్పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. భారతదేశం పెట్రోల్లో ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాల కోసం చెరకు, మొక్కజొన్న, విరిగిన బియ్యాన్ని ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఎల్ని వల్ల చెరకు, మొక్క జొన్న దిగుబడి తగ్గితే, ప్రభుత్వం ఇంధనం కంటే దేశ ఆహార భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల ఇథనాల్ ఉత్పత్తి వ్యూహాలు మారవచ్చు. తక్కువ నీటితో పండే చిరుధాన్యాల సాగు, బిందు సేద్యం ముం దస్తు నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా ఈ నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

## రావణ్‌పై పెట్టిన ఉపా కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలి: అంబటి, సీపీఐ నారాయణ




**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ పై పోలీసులు ఉపా కేసు నమోదు చేయడం తెలిసిందే. అయితే, దేశద్రోహులపై ఉపయోగించే ఈ చట్టం కింద కేసు నమోదు చేయడం ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ చర్యను ఇప్పటికే వైసీపీ ఖండిస్తుండగా... తాజాగా కమ్యూనిస్టులు కూడా ఈ జాబితాలో చేరారు. విజయవాడ వేదికగా జరిగిన ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో వైసీపీతో పాటు లెఫ్ట్ పార్టీలైన సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొని ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు ప్రస్తుతం అనేక ప్రజా సమస్యల్లో చిక్కుకుపోయాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అసలు విషయాల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే రావణ్‌ను టార్గెట్ చేస్తూ ఈ రాజకీయ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. అతడిపై మోపిన అక్రమ 'ఉపా' కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ... ప్రశ్నించే గొంతుకలను భయభ్రాంతులకు గురిచేసి, అణచివేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని ప్రయోగించిందని మండిపడ్డారు. రావణ్‌పై పెట్టిన కేసు చట్టవిరుద్ధమని, ఎలాంటి ఆలస్యం లేకుండా ఈ కేసును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మంత్రి ఆనం పుట్టినరోజు... కేక్ కట్ చేయించిన సీఎం చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** ఇవాళ రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం కాన్ఫరెన్స్ హాలులో మంత్రి పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రే స్వయంగా ఆనం రామనారాయణరెడ్డితో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆనంకు కేక్ తినిపించి, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ వేడుకతో కాన్ఫరెన్స్ హాలులో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర మంత్రులు కూడా ఆనం రామనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సహచర మంత్రి పుట్టినరోజును గుర్తుపెట్టుకుని సీఎం చంద్రబాబు వేడుక జరపడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు.. కానీ లాభాలు ఎన్నో: కేంద్రం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఈ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వినియోగంతో కొన్ని వాహనాల్లో మైలేజ్ 3-5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే మైలేజ్‌ను మాత్రమే ప్రమాణంగా చూడకూడదని, ఈ20 వల్ల అనేక కీలక ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్‌కు సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీ-నాక్ లక్షణాలు ఉంటాయని పేర్కొంది. దీంతో ఇంజిన్ పనితీరు మెరుగుపడటంతో పాటు వాహనానికి మంచి పికప్, సాఫీ యాక్సిలరేషన్, శుభ్రమైన ఇంజిన్ నిర్వహణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడించింది. ఈ20 అమలుకు ముందే ఆటోమొబైల్ తయారీ సంస్థలు, విడిభాగాల తయారీదారులు, పరిశోధనా సంస్థలతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంజిన్ పనితీరు, ఇంధన వ్యవస్థ, మన్నిక, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ20 అమలు చేపట్టినట్లు పేర్కొంది. వాహన తయారీ సంస్థలు పూర్తిగా సంతృప్తి చెందకపోతే ఈ20కు మద్దతు ఇచ్చేవి కాదని, వాహనాల వారంటీలను కూడా కొనసాగించేవి కాదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం దాదాపు అన్ని కంపెనీలు పాత, కొత్త వాహనాలకు వారంటీ ఇస్తుండటమే దీనికి నిదర్శనమని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మారుతీ సుజుకీ 2.84 కోట్ల వాహనాలకు సర్వీసింగ్ చేయగా, అందులో 1.5 కోట్ల పాత ఈ20 సర్టిఫికేషన్ లేని వాహనాలు కూడా ఉన్నాయని తెలిపింది. అయినప్పటికీ ఈ20 కారణంగా తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం లేదా అసాధారణ అరుగుదల వంటి సమస్యలు ఏవీ గుర్తించలేదని వెల్లడించింది. హీరో మోటోకార్ప్ కూడా ఇదే తరహా అనుభవాన్ని నివేదించినట్లు తెలిపింది.

## డిజిటల్ టికెట్లపై కొత్త నిబంధన.. రైల్వే శాఖ కీలక ప్రకటన




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారతీయ రైల్వే శాఖ డిజిటల్ అన్‌రిజర్వ్డ్ టికెట్ల విషయంలో ప్రయాణికులకు కీలక స్పష్టతనిచ్చింది. 'రైల్ వన్' యాప్ ద్వారా బుక్ చేసుకున్న డిజిటల్ టికెట్లను ప్రయాణ సమయంలో తప్పనిసరిగా బుకింగ్ చేసిన మొబైల్ ఫోన్‌లోనే చూపించాలని స్పష్టం చేసింది. టికెట్ స్క్రీన్‌షాట్లు, పీడీఎఫ్ కాపీలు లేదా వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫార్వార్డ్ చేసిన కాపీలు చెల్లవని తేల్చి చెప్పింది. వీటిని ప్రయాణానికి సరైన ఆధారాలుగా పరిగణించబోమని రైల్వే అధికారులు వెల్లడించారు. డిజిటల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే జూలై 8న తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. ఇటీవల ఓ ప్రయాణికుడు వాట్సాప్ స్క్రీన్‌షాట్ చూపించగా, అధికారులు అతడికి జరిమానా విధించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రయాణికులు రైలు బయలుదేరక ముందే టికెట్ బుక్ చేసుకోవాలని, ప్రయాణ సమయంలో టికెట్ బుక్ చేసిన ఫోన్‌తో పాటు తప్పనిసరిగా అసలు గుర్తింపు కార్డును వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. శ్రీఅయితే, రైల్వే శాఖ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులందరికీ ఒకరే టికెట్లు బుక్ చేసే సందర్భాల్లోనూ, సాంకేతిక పరిజ్ఞానం లేని వృద్ధుల ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే సాధకబాధల గురించి పలువురు ప్రశ్నిస్తున్నారు. టికెట్ బుక్ చేసిన వ్యక్తి ప్రయాణంలో లేకపోతే ఇబ్బందులు తప్పవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఆందోళనలపై రైల్వే శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. 'రైల్ వన్' యాప్‌లో డిజిటల్ పద్ధతిలో అన్‌రిజర్వ్డ్ టికెట్లు కొనుగోలు చేస్తే 3 శాతం రాయితీ లభిస్తున్నప్పటికీ, తాజాగా కఠినతరం చేసిన ఈ నిబంధన అనేకమందికి ఇబ్బందికరంగా మారింది.

## హైదరాబాద్ శివార్లలో స్నేహితుల చేతిలో యువకుడి హత్య

**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ నగర శివార్లలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గంజాయి లావాదేవీలు, ఓ యువతి విషయంలో తలెత్తిన వివాదం కారణంగా స్నేహితులే ఓ యువకుడిని కిరాతకంగా కొట్టి చంపారు. హయత్‌నగర్ మండలం పసుమాముల గ్రామంలో ఈ సంఘటన వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం, పసుమాముల గ్రామానికి చెందిన నిషాని సుహాస్ (22) గంజాయికి బానిసవడంతో పాటు, ఆ వ్యసనం కోసం గంజాయి విక్రయాలకు కూడా పాల్పడేవాడు. ఈ క్రమంలో తన స్నేహితుడి ఫోన్ నుంచి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువతికి అసభ్యకర సందేశాలు పంపడం, అనుచితంగా ప్రవర్తించడంతో వివాదం మొదలైంది. ఆ యువతి.. సుహాస్ స్నేహితుల్లో ఒకరికి గాళ్ ఫ్రెండ్. దీనికి తోడు గంజాయి విక్రయాలకు సంబంధించిన పాత నగదు గొడవలు కూడా తోడయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున నిందితులు సుహాస్‌ను ఇంటి నుంచి బయటకు పిలిచారు. గ్రామ శివార్లలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి విచక్షణారహితంగా దాడి చేశారు. వారి నుంచి తప్పించుకునేందుకు సుహాస్ సుమారు అర కిలోమీటరు మేర పరుగెత్తినప్పటికీ, నిందితులు వెంబడించి పట్టుకున్నారు. మర్మావయవాలపై సహా శరీరమంతా తీవ్రంగా కొట్టడంతో సుహాస్ మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పెద్ద అంబర్‌పేట్-పసుమాముల రహదారిలోని శ్మశానవాటిక సమీపంలో గల సిమెంట్ బెంచీపై పడేసి వెళ్లారు.

(మొదటిపేజీ తరువాయి)

## వేధిస్తున్న నిధుల కొరత!

ప్రాంతాలకు అరకొరగా ఆపరేషన్ అండ్ మెంటినెన్స్ నిధులు కేటాయించారు. ఇప్పటికే మైనర్ ఇరిగేషన్ పరిధిలో ప్లాన్ గ్రాంట్ పూర్తిగా నిలిపివేశారు. కనీసం తుఫాన్లు సమయంలోనైనా విడుదల చేసే సైక్లోన్ డేమేజ్ రిపేర్స్(సీడీఆర్) నిధులు కూడా కేటాయించలేదు. పూర్వోదయ గ్రాంట్ కింద కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్రకు రూ. 2,500కోట్లు కేటాయించనుందని ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. ఈ నిధుల కోసం చూస్తున్నామని, అవి వస్తే మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన అన్ని పనులు పూర్తిచేయవచ్చునని అన్నారు. మైనర్ ఇరిగేషన్ కింద చెరువులు, వాగులు, గెడ్డలు బాగుపడాలంటే మంత్రి అచ్చెన్నాయుడు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

## సియోల్‌లో కొరియా ఆటో పరిశ్రమ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ

ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధికి, ఈవీ పరిశోధనలకు ప్రత్యేక గ్రాంట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా, ఈవీ బ్యాటరీలు, మాగ్నెట్‌ల తయారీకి అవసరమైన ముడిసరుకుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో ఒక 'రేర్ ఎర్త్ కారిడార్' ఏర్పాటు చేయబోతున్నట్లు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే బలమైన ఆటోమోటివ్ పరిశ్రమ ఉందని, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో సుమారు 100 కిలోమీటర్ల మేర ఆటోమోటివ్ విడిభాగాల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. కియా మోటార్స్‌తో పాటు అశోక్ లేలాండ్, ఇసుజు, హీరో మోటోకార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని గుర్తుచేశారు. అశోక్ లేలాండ్ సంస్థ సుమారు రూ. 2,500 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. "అనంతపురంలో కియా మోటార్స్ సాధించిన అద్భుత విజయమే మా ప్రభుత్వ నిబద్ధతకు, సామర్థ్యానికి నిదర్శనం" అని లోకేశ్ అన్నారు. కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా రెండు ఆటో కాంపోనెంట్స్ పార్కులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కియా క్లస్టర్ సమీపంలో ఒకటి, శ్రీసిటీ-చిత్తూరు-తిరుపతి కారిడార్‌లో మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కులలో ప్లగ్-అండ్-ప్లే షెడ్లు, ఉమ్మడి టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సపోర్ట్ కోసం ఒక 'కొరియా డెస్క్' కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ఏపీఎస్ఎస్‌డీసీ, కౌశలం ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈవీ పవర్‌ట్రెయిన్‌ల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ఒక అకాడమీని ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్రంలోని 250కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల సహకారం తీసుకోవాలని కొరియన్ సంస్థలను కోరారు. ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)లో ప్రత్యేక కొరియా డెస్క్, ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు లోకేశ్ ప్రకటించారు.

# తాటిగుడ జలపాతంపై నిర్లక్ష్యం తగదు: పర్యాటకులు



అనంతగిరి, : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగుడ జలపాతం వద్ద నిర్వహణ లోపం పర్యాటకులకు శాపంగా మారింది. ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి వచ్చే పర్యాటకులు ఇక్కడి పరిస్థితిని చూసి నిరుత్సాహానికి గురవుతున్నారు. తాటిగుడ జలపాతం వద్ద గతంలో కనీస సౌకర్యాలు ఉండేవి కావు. అయితే తొమ్మిదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ అధికారులు రూ.30 లక్షలతో ఇక్కడ సదుపాయాలు కల్పించారు. జలపాతాన్ని ఆనుకుని వ్యూపాయింట్ నిర్మించి, పర్యాటకుల సౌకర్యార్థం మినీ రెస్టారెంట్, స్నానం చేసిన తరువాత దుస్తులు మార్చుకునేందుకు రెండు రూమ్‌లు, అలాగే జలపాతం వద్దకు వెళ్లేందుకు మెట్లను నిర్మించారు. అంతా బాగానే ఉన్నా నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో మినీ రెస్టారెంట్ వద్దకు, దుస్తులు మార్చుకునే గదుల వద్దకు వెళ్లడానికి అవకాశం లేకుండా ఉంది. పైగా విష కీటకాలు ఉంటాయేమోనని పర్యాటకులు భయపడుతున్నారు. అలాగే మెట్ల పైనుంచి నీరు పారుతుండడంతో కొంత వరకు నాచుపట్టి ప్రమాదభరితంగా మారింది. మెట్లను ఆనుకుని ఉన్న ఇనుప రెయిలింగ్ వద్ద ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాములు ఉన్నాయేమోనని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎత్తైన ప్రదేశంలో పంట పొలాను ఆనుకుని నిర్మించిన వ్యూపాయింట్ వద్ద ఉన్న స్టీల్ రెయిలింగ్ ఊడిపోతుండడంతో పర్యాటకులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా పర్యాటకశాఖ అధికారులు స్పందించి ఇక్కడ సౌకర్యాలను కల్పించడంతో పాటు సక్రమంగా నిర్వహణ చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

## "దివ్యాంగుల ఆధ్యాత్మిక యాత్రకు ఆకుల ఫౌండేషన్ చేయూత...



**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట, మాడుగుల, కసింకోట, ఎలమంచిలి మండలాలకు చెందిన 12 మంది దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులకు కాశీ--ప్రయాగ్‌రాజ్--అయోధ్యతో పాటు ఢిల్లీ పర్యటనను ఆకుల ఫౌండేషన్ అధినేత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సాగిన ఈ పుణ్యయాత్రను ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశారు. యాత్రలో ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు, జిల్లా దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, మండల కార్మిక సంఘం నాయకుడు కొయ్య శ్రీనివాసరావు, వీఆర్‌పీఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇంటికే పరిమితమై పవిత్ర క్షేత్రాలను దర్శించుకునే అవకాశం లేని దివ్యాంగులను గుర్తించి, భారతీయ రైల్వే కల్పిస్తున్న 75 శాతం ప్రయాణ రాయితీని వినియోగించుకొని వారికి ఈ పుణ్యయాత్రను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాత్రలో పాల్గొన్న వారందరికీ వారం రోజుల పాటు భోజనం, వసతి, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ ఉచితంగా కల్పించినట్లు చెప్పారు. పర్యటనలో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోట, జాతీయ నాయకుల సమాధులు, మ్యూజియంలను సందర్శించారు. అనంతరం కాశీలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి, శ్రీ అన్నపూర్ణ అమ్మవారి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం, అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయాన్ని సందర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. యాత్రలో పాల్గొన్న దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

## జగన్‌పై చింతా మోహన్ సెటైర్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మావిగన్‌పై కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మావిగన్ అంటే మామిడి పండు అని అనుకుంటున్నారని జగన్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వచ్చే ఎన్నికల్లో ఇదే అంశంపై జగన్ వెళ్తారంటే అయ్యే పనికాదన్నారు. ఒకే ఒక్క ఛాన్స్ అని జగన్ అడిగితే ప్రజలు ఇచ్చారని.. ఇక ఆయనకు ఎటువంటి ఛాన్స్ ఇవ్వరని వ్యాఖ్యానించారు. జగన్ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని.. ఏదో ఊహించుకొని మాట్లాడుతున్నారని అన్నారు. జగన్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు 11 ఉన్నాయని.. ఎన్నికల ముందు జైలుకు వెళ్తారా? లేదా? అనేది ముందు తెలుసుకోవాలని కేంద్రమాజీ మంత్రి హితవుపలికారు. జయలలితకు ఒక న్యాయం? జగన్‌కు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. 'జగన్ మావిగన్ అంటే నేను తిరుపతి అంటాను.. రాజధానిని రాయలసీమలో పెట్టమని అంటాను' అంటూ చింతా మోహన్ వ్యాఖ్యలు చేశారు.

## వైసీపీపై ఎమ్మెల్యే సుందరపు ఫైర్

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో మత ఘర్షణలకు వైసీపీ కుట్ర పన్నుతోందని జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ కుట్రలను ప్రజలు గమనించాలన్నారు. సనాతన ధర్మం, హిందుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జడ శ్రవణ్ ఏలూరులో సభ పెట్టి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడారన్నారు. యూట్యూబర్ ప్రశ్న రావణ్, నటుడు ప్రకాశ్ రాజ్‌కు సనాతన ధర్మం అంటే ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. ప్రశ్న రావణ్, ప్రకాశ్ రాజ్, జడ శ్రవణ్ పెయిడ్ ఆర్టిస్టులు అని వ్యాఖ్యానించారు. దేశంలో ఘర్షణలు సృష్టించాలనే కుట్రలు జరుగుతున్నాయని జనసేన ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్రను పోలీసులు ఛేదించాలన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టించాలని ప్రయత్నం చేస్తున్న వారికి తాడేపల్లి నుంచి ఉన్న సంబంధాలు బయటపెట్టాలన్నారు.

## ల్యాండ్ బ్యాంకు భూములకు 100 అడుగుల రోడ్డు



**మాకవరపాలెం, పతాకం న్యూస్:** మండలంలో భారీ కంపెనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం గుర్తించిన ల్యాండ్ బ్యాంకు భూములకు వంద అడుగుల రహదారి నిర్మాణం కోసం రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. మండలంలోని పైడిపాల, పెద్దిపాలెం, బూరుగుపాలెం, పాపయ్యపాలెం గ్రామాల్లో 4,250 ఎకరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు 'ల్యాండ్ బ్యాంకు' కింద గుర్తించారు. ఈ భూముల్లో ఒక భారీ కంపెనీ ఏర్పాటవుతుందని, సీఎం చంద్రబాబు నాయుడు త్వరలో శంకుస్థాపన చేస్తారని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇటీవల ప్రకటించారు. ఈ నాలుగు గ్రామాల్లోని భూములను ఏపీఐఐసీ ఎండీ దినేశ్‌కుమార్ ఇటీవల పరిశీలించారు. మొత్తం భూముల్లో సుమారు మూడు వేల ఎకరాలు డి.పట్టా భూములుకాగా, వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు వున్నాయి. 50-60 ఎకరాలు జిరాయితీ భూములు వుండే అవకాశం వుంది. ల్యాండ్ బ్యాంకుగా గుర్తించిన భూముల్లో ఏర్పాటు చేసే కంపెనీలు, పరిశ్రమలకు నీటి అవసరాలను తీర్చడానికి పాపయ్యపాలెం రిజర్వాయర్ వుంది. ఇదిలావుండగా పైడిపాల నుంచి మాకవరపాలెం, తామరం, భీమబోయినపాలెం మీదుగా శెట్టిపాలెం సమీపంలో కాఫీ పొడి తయారీ కేంద్రం వద్ద ఉన్న రహదారి వరకు 100 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి అధికారులు మ్యాప్ సిద్ధం చేశారు. ఇక్కడి నుంచి ఎరకన్నపాలెం వాక రోడ్డుకి దీనిని అనుసంధానం చేస్తారు. వంద అడుగుల వెడల్పుతో నిర్మించే రహదారి కోసం ప్రభుత్వ, డి.పట్టా భూములతో పాటు జిరాయితీ భూముల వివరాలు, ఆయా రైతుల పేర్లలతో జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. మండలంలో ఏర్పాటు కానున్న పలు కంపెనీలతోపాటు కొత్తగా ఏర్పాటు చేయనున్న వంద అడుగుల రహదారుల పనులకు సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసే అవకాశం వుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

## భీమిలి సీఐగా దివాకర్ యాదవ్



**భీమిలి, పతాకం న్యూస్:** ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బదిలీల్లో భాగంగా మహారాణిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జి. దివాకర్ వాయునందన యాదవ్‌ను భీమిలి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దివాకర్ యాదవ్ 2007 బ్యాచ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు. నేర నియంత్రణ, మహిళల ప్రజల భద్రత కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఇటీవల ఆయన విధి నిర్వహణను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. అలాగే ఆయన ప్రతిభను గుర్తించిన విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఐదు రివార్డులు అందజేసి అభినందించారు.

## విశాఖపట్నం ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభం

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పర్యావరణ పరిరక్షణకు, హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) విశాఖపట్నం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్‌లను ఘనంగా ప్రారంభించారు. ఈ ఛార్జింగ్ స్టేషన్‌ను ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ (నెట్‌వర్క్-1) ప్రఫుల్ల కుమార్ జేనాలి, ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్, విశాఖపట్నం రాహుల్ సాంకృత్య సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించడంతో పాటు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎస్‌బీఐ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టేందుకు బ్యాంక్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌కు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## 'సర్'లో విశాఖ ఆదర్శంగా నిలవాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు కలిగి ఉన్న జిల్లాల్లో విశాఖపట్నం ఒకటని, ఇక్కడ నిర్వహించే సర్ (ఓటరు జాబితా సమగ్ర సవరణ) ప్రక్రియ మిగిలిన ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా అధికారులంతా కలిసికట్టుగా పనిచేయాలని భారత ఎన్నిక సంఘం ముఖ్య కార్యదర్శి అవినాష్ కుమార్ పేర్కొన్నారు. భారత ఎన్నిక సంఘం అండర్ సెక్రటరీ సంజయ్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో అవినాష్‌కుమార్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో ఈఆర్వోలు కీలకపాత్ర పోషించాలని, ఏ నిర్ణయమైనా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి చిన్న అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిండంతోపాటు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ఒక్క ఓటూ పోవడానికి వీల్లేదని, అనర్హులు జాబితాలో ఉండకూడదని స్పష్టంచేశారు. ఈవోఆర్వోలు తమ పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని, తక్కువ ఫలితాలు వచ్చిన చోట క్షేత్రస్థాయిలో పర్యటించి కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. ఆధార్ తదితరాలు గుర్తింపుకార్డు మినహా ప్రామాణికం కాదన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను సహేతుకంగా నిర్వహించి ప్రతిపాదనల్లో పొందుపర్చాలన్నారు. డిజిటిలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. తక్కువ శాతం డిజిటలైజేషన్ ప్రక్రియను చేసిన వారిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరరనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఓటరు జాబితా సమగ్ర సవరణప్రక్రియ సజావుగా సాగుతోందని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ చీఫ్ ఎన్నికల కమిషనర్ పవన్‌కుమార్ శర్మ నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో సర్ వివరాలను వెల్లడించారు. ఇప్పటి వరకు 99.52శాతం ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ జరిగిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ 69.18 శాతం పూర్తయిందన్నారు. చనిపోయిన, వలసవెళ్లిన వారి వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలే తప్ప చివరినిమిషం వరకు దాచిపెట్టవద్దన్నారు. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రితో ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ఫ్రీజ్ అయ్యేలోగా ప్రక్రియ ముగించాలని సీఈసీ సూచించారు.

## రీజనల్ ఏవియేషన్ కేంద్రంగా విశాఖ ఎయిర్‌పోర్టు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం విమానాశ్రయాన్ని భవిష్యత్తులో రీజనల్ ఏవియేషన్, నిర్వహణ, మరమ్మతులు, ఆపరేషన్ (ఎంఆర్‌ఓ), కార్గో కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ శ్రీభరత్ అన్నారు. విశాఖపట్నం విమానాశ్రయం ఆఖరి సలహా సంఘం సమావేశాన్ని విమానాశ్రయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వానికి 366 ఎకరాలు వుందని, దీని వినియోగంపై సీఎం చంద్రబాబుకు స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయన్నారు. భోగాపురం విమానాశ్రయం స్థిరపడ్డాక, అక్కడ ప్రయాణికుల సంఖ్య పెరిగాక, విశాఖ విమానాశ్రయం అభివృద్ధిపై దృష్టి పెడతారని వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి చర్యలు చేపడతామని ఎంపీ హామీ ఇచ్చారు. వారి నైపుణ్యాలకు అనుగుణంగా జీఎంఆర్, హోటల్ పరిశ్రమ, హోటల్ ఫెడరేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్‌తో పాటు ఇతర పరిశ్రమల ద్వారా పునర్నియామక అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రతి విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగుల నైపుణ్యం ఆధారంగా జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో విమానాశ్రయం డైరెక్టర్ పురుషోత్తం, సలహా సంఘం సభ్యుడు ఒ.నరేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 767 కిలోల గంజాయి, హషీష్ ఆయిల్ దగ్ధం




**పరవాడ, పతాకం న్యూస్:** మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశే లక్ష్యంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్ర ప్రభుత్వ 'ఈగల్' వింగ్ సంయుక్తంగా భారీ స్థాయిలో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు వేర్వేరు కేసుల్లో చీజదీ అధికారులు స్వాధీనం చేసుకున్న సుమారు 767.5 కిలోల గంజాయిని, 4.036 లీటర్ల హషీష్ ఆయిల్‌ను శుక్రవారం నాడు శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు. పరవాడ మండలం, తానం గ్రామంలోని 'రామ్‌కీ ఫార్మా' కంపెనీకి చెందిన అత్యాధునిక ఇన్సినరేషన్ ప్లాంట్‌లో కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ, బహిరంగంగా కాల్చకుండా మెషీన్ ద్వారా ఈ డ్రగ్స్‌ను నిర్వీర్యం చేశారు. ఈగల్ ఎస్పీ జి.స్వరూప రాణి, ఎన్‌సీబీ జోనల్ డైరెక్టర్ శ్రీ పంకజ్ కుమార్ ద్వివేదిల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియ ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సీబీ సూపరింటెండెంట్ రాజన్ కుమార్, ఇంటెలిజెన్స్ ఆఫీసర్ కె.కిరణ్ బాబు, ఈగల్ విభాగం ఇన్‌స్పెక్టర్లు జి.దేముళ్ళు, డాక్టర్ కల్యాణి, అనకాపల్లి ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. "యువతను వ్యసనాల బారి నుండి కాపాడేందుకు, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. భవిష్యత్తులోనూ ఇలాంటి తనిఖీలు, నిర్మూలన చర్యలు నిరంతరం కొనసాగుతాయి. పట్టుబడిన మత్తు పదార్థాలను ఎప్పటికప్పుడు కోర్టు అనుమతితో ఇలాగే ధ్వంసం చేస్తాం" అని అధికారులు స్పష్టం చేశారు.

# ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలి: కలెక్టర్ నిషాంతి



**పాడేరు, పతాకం న్యూస్:** ప్రత్యేక ఓటరు జాబితాల సమగ్ర సవరణ (సర్)ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ వివరాలు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ వేగవంతంగా జరగాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, డీఆర్‌వో ఎంవీఎస్ లోకేశ్వరరావులతో కలిసి సర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే శతశాతం ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందించామని, వాటిని తిరిగి స్వీకరించే ప్రక్రియ శుక్రవారంతో ముగుస్తుందన్నారు. ఇప్పటికే స్వీకరించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 70 శాతం వరకు జరిగిందని, మిగిలిన ఫారాలను సిబ్బంది ఓటర్ల నుంచి సేకరిస్తున్నారన్నారు. శుక్రవారం నాటికి మొత్తం ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి, యుద్ధప్రాతిపదికన వాటిని డిజిటలైజేషన్ చేసే పనులు చేపట్టారు. అలాగే ఏదైనా కారణంతో ఎన్యూమరేషన్ ఫారాలు అందకపోతే, రీజనరేట్ చేసి ఓటర్లకు అందించాలన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్యూమరేషన్ సిబ్బందికి సంపూర్ణంగా సహకరించి జిల్లాలో సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని, స్థానికంగా లేని, రెండు చోట్ల ఓట్లున్న, మృతి చెందిన వారి పేర్లను పక్కాగా పరిశీలించి మాత్రమే జాబితాల నుంచి తొలగించాలన్నారు. ఒకమారు తొలగించిన పేర్లు తిరిగి జాబితాల్లో నమోదు చేసే అవకాశం లేదని గుర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ చేపట్టేందుకు సచివాలయాల్లో సదుపాయాలను కల్పించి, నిరంతరం ఆయా పనులు చేయిస్తున్నామన్నారు. అలాగే ఎన్యూమరేషన్ ఫారాల సేకరణకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.భుజంగరావు, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్)ప్రక్రియలో భాగంగా గురువారం నాటికి జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 73.31 శాతం పూర్తయింది. జిల్లాలోని పదకొండు మండలాల్లో 4 లక్షల 99 వేల 752 మందికి గాను 4 లక్షల 99 వేల 752 మందికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, 3 లక్షల 66 వేల 386 మంది ఫారాలను డిజిటలైజేషన్ చేశారు. దీంతో జిల్లాలో 73.31 శాతం సర్ ప్రక్రియ పూర్తయింది.

# అధిక ఆల్కహాల్ ఉన్న మందులపై కేంద్రం ఆంక్షలు.. ఇక ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అధిక మోతాదులో ఆల్కహాల్ కలిగిన ఔషధాల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి ఉండి, 30 ఎంఎల్ కంటే పెద్ద ప్యాక్‌లలో విక్రయించే మందులకు ఇకపై డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను తప్పనిసరి చేసింది. ఈ మేరకు డ్రగ్స్ రూల్స్, 1945ను సవరిస్తూ నేడు (జూలై 10) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటివరకు షెడ్యూల్ 'కే' కింద మినహాయింపు పొందుతున్న ఈ తరహా ఔషధాలను, కఠిన నిబంధనలు అమల్లో ఉండే షెడ్యూల్ 'హెచ్1' జాబితాలోకి చేర్చింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ధృవీకరించిన ప్రిస్క్రిప్షన్‌తో మాత్రమే వీటిని విక్రయించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఫార్మసీలు వీటి అమ్మకాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి. తయారీ సంస్థలు సైతం ఈ ఔషధాల ఉత్పత్తికి ప్రత్యేక లైసెన్సులు పొందడం తప్పనిసరి. కొన్ని రకాల టానిక్‌లు, దగ్గు మందులలో 80 నుంచి 90 శాతం వరకు ఆల్కహాల్ ఉన్నప్పటికీ, వాటిలో సుగంధ ద్రవ్యాలు ఉన్నాయన్న కారణంతో ఇప్పటిదాకా మినహాయింపులు ఉండేవి. అయితే, వీటిని వైద్యేతర అవసరాలకు, మత్తు కోసం విరివిగా వాడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వాలు, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) గుర్తించాయి. ఈ నేపథ్యంలోనే గతేడాది అక్టోబర్‌లో ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసి, అభ్యంతరాలు మరియు సూచనలను స్వీకరించిన ప్రభుత్వం, తాజాగా ఈ తుది నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వచ్చాయి. ఆరోగ్య అవసరాల నిమిత్తం ఈ మందులు కావాల్సిన రోగులు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వం ప్రస్తుతానికి ఏ ఉత్పత్తిపైనా నిషేధం విధించలేదని, కేవలం నియంత్రణ చర్యలు మాత్రమే చేపట్టిందని స్పష్టం చేసింది. తక్కువ ఆల్కహాల్ మోతాదు ఉన్న లేదా 30 ఎంఎల్ లోపు ప్యాక్‌లకు ఈ నిబంధనలు వర్తించవని అధికారులు వెల్లడించారు.

## అధిక లాభాల పేరుతో ఖాతాదారులకు టోకరా.. ఆల్ట్రిటీ జెనిసెస్ డైరెక్టర్ల అరెస్ట్

**కాకినాడ, పతాకం న్యూస్:** అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసిన కాకినాడకు చెందిన ఆల్ట్రిటీ జెనిసెస్ సంస్థ డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సంస్థ డైరెక్టర్లు మోజేష్, లలితాంబికను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.15 వేల చొప్పున చెల్లిస్తామని మాయమాటలు చెప్పి సంస్థ భారీగా డిపాజిట్లు సేకరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.48 కోట్ల మేర ప్రజల నుంచి వసూలు చేసినట్లు విచారణలో తేలింది.కొన్ని నెలలుగా పెట్టుబడిదారులకు చెల్లింపులు నిలిపివేయడంతో కాకినాడలోని ఆల్ట్రిటీ జెనిసెస్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేపట్టారు. ఆరుగురు ఖాతాదారులు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా సంస్థ డైరెక్టర్లు మోజేష్, లలితాంబికను అదుపులోకి తీసుకున్నారు.

# మూడు గ్రేడ్లలో పంచాయతీలు పరిమితం..



**పార్వతీపురం, పతాకం న్యూస్:** పంచాయతీల అభివృద్ధికి గ్రామీణ అభివృద్ధిశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఐదు కేటగిరీల్లో ఉన్న పంచాయతీలను మూడు కేటగిరీలకు పరిమితం చేసింది. గతంలో గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4, గ్రేడ్-5 పంచాయతీలు జిల్లాలో ఉండేవి. ఇకపై అలా కాకుండా గ్రేడ్-1 గ్రేడ్-2, గ్రేడ్-3 రూర్బన్ పంచాయతీలను మినహాయించి గ్రేడ్-4, గ్రేడ్-5 పంచాయతీలను గ్రేడ్-3గా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో రూర్బన్ పంచాయతీలు మూడు ఉన్నాయి. గ్రేడ్-1 కింద 136 పంచాయతీలు, గ్రేడ్-2 కింద వంద పంచాయతీలు, గ్రేడ్-3 కింద 312 పంచాయతీలు ఉన్నాయి.

మొత్తం 451 పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు మంజూరైనప్పటికీ.. ప్రస్తుతం జిల్లాలో 419 మంది వివిధ హోదాలో ఉన్నారు. 32 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 90 ప్రకారం తాజాగా ఏర్పడిన పంచాయతీలకు ఉద్యోగులను సర్దుబాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రభుత్వ తాజా ఆదేశాల ప్రకారం.. పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులుగా గ్రామ కార్యదర్శులు ఉంటారు. స్థానిక ఎన్నికల అనం తరం సర్పంచ్‌ల పాలన ప్రారంభమైన తర్వాత కూడా వారు ఆ హోదాలోనే కొనసాగనున్నారు.

## భూమిని పేదలకు ఇవ్వాలని ధర్నా



**రణస్థలం, పతాకం న్యూస్:** 'ప్రభుత్వ భూమిని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలి. పేదలకు పంపిణీ చేయాల'ని జీరుపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. రణస్థలం మండలంలోని జీరుపాలెం, జగన్నాథపురంలో సుమారు 18 ఎకరాల ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించి.. తమపేరిట పట్టాలు రాయించుకున్నారు. ఈ భూములను పేదలకు కేటాయించాలని, ఆ పట్టాలు రద్దు చేయాలని జీరుపాలెం, జగన్నాథపురం గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ భూముల వ్యవహారంపై న్యాయం చేయాలని జీరుపాలెంలో ఆందోళన చేపట్టారు. దీంతో అధికారులు రంగంలోకి దిగి ఆ భూములను పరిశీలించారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి తదితరులు జీరుపాలెం చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కాగా.. కొంతమంది ప్రభుత్వ భూమిని పట్టాలుగా పొందారని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆ పట్టాలు రద్దు చేయాలని ఆయా గ్రామస్థులు మరోసారి డిమాండ్ చేశారు. వాస్తవాలను పరిశీలించి ఈ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ కిరణ్‌కుమార్ నచ్చజెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు.

## పింఛన్లు మంజూరు చేయాలి



**లక్కవరపుకోట, పతాకం న్యూస్:** తమకు పింఛన్లు మంజూరు చేయాలని ఎస్.కో ట నియోజకవర్గానికి చెందిన అనేకమంది ఎమ్మెల్యే లలిత కుమారిని కోరారు. ఈ మేరకు ఎల్.కోటలోని ఎమ్మె ల్యే ఇంటి వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వారంతా హాజరయ్యారు. ఈసందర్భంగా వినతులు అందజేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా కొత్త పింఛన్లు విడుదల చేయలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుని అర్హులందరికీ పింఛన్లు అందిస్తుందని తెలిపా రు. దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేసి, సిద్ధంగా ఉంచుతున్నామని ఆమె చెప్పారు.

## డ్రైవర్‌కు గుండెపోటు.. సీపీఆర్ చేసి ప్రాణం కాపాడిన కండక్టర్



**కడప, పతాకం న్యూస్:** విధి నిర్వహణలో ఉన్న ఒక ఆర్టీసీ డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు రాగా, తోటి కండక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి సీపీఆర్ చేయడం ద్వారా ఆయన ప్రాణాలను కాపాడారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. జమ్మలమడుగు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు తిరుపతికి వెళ్తుండగా చాపాడు మండలం భద్రిపల్లి సమీపంలో ఈ సంఘటన జరిగింది. డ్రైవర్ ఎస్.జె. బాషాకు తీవ్రమైన ఛాతీ నొప్పి రావడంతో, బస్సును రోడ్డు పక్కన నిలిపి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన కండక్టర్ కె.ఎం. బాషా 108 అత్యవసర సేవలకు సమాచారం అందించి, డ్రైవర్‌కు సీపీఆర్ చేస్తూ ప్రాథమిక చికిత్స అందించారు.బాధితుడిని వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

## కేజీబీవీలో 21 మంది విద్యార్థినులకు అస్వస్థత



**గార, పతాకం న్యూస్:** గార మండలం శాలిహుండంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కలకలం రేగింది. గత రెండు వ్యవధిలో 21 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందారు. 13 మంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులతో బాధపడుతుండగా.. వారిని గార పీహెచ్‌సీకి తరలించారు. సాయంత్రం నాటికి వారు కోలుకున్నారు. మళ్లీ మరో 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిని కూడా చికిత్స నిమిత్తం గార పీహెచ్‌సీకి తరలించారు. విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందారు. కాగా.. ఈ విషయమై కేజీబీవీ ప్రత్యేకాధికారి బి.రజనీకుమారి వద్ద ప్రస్తావించగా.. 'రెండు రోజులుగా అస్వస్థతకు గురైన విద్యార్థినులంతా కోలుకున్నారు. తల్లిదండ్రుల అంగీకారం మేరకు వారిని ఇళ్లకు పంపించాం. ప్రస్తుతం విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉన్నార'ని తెలిపారు. ఇదిలా ఉండగా సమాచారం తెలిసిన వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శిని కేజీబీవీకి పంపించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసులు తెలిపారు.

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే.. బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతాను: షేక్ హసీనా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు. "వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి" అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు. 2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

## హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం.. డెకరేషన్ వస్తువుల గోదాంలో మంటలు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** నగరంలోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చాదర్‌ఘాట్ మూసీ నది సమీపంలో ఉన్న ఓ డెకరేషన్ వస్తువుల గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాంలో ప్లాస్టిక్, థర్మాకోల్, బట్టలు వంటి సులభంగా అంటుకునే డెకరేషన్ వస్తువులు భారీగా నిల్వ ఉంచడంతో.. క్షణాల వ్యవధిలోనే మంటలు గోదాం అంతటా వ్యాపించాయి. దట్టమైన పొగతో పాటు మంటలు పెద్ద ఎత్తున పైకి ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

# శరవేగంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఏడో ప్యాకేజీ పనులు



**కశింకోట, పతాకం న్యూస్:** పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఏడో ప్యాకేజీ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో గోదావరి జలాలను ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు తరలించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు కాలువలో మిగిలిన పనుల్లో వేగం పెంచారు. ఎలమంచిలి మండలం ఏటికొప్పాక వద్ద నుంచి కశింకోట మండలం తాళ్లపాలెం వరకు ఆయా ప్రదేశాల్లో పనులు చేస్తున్నారు. పోలవరం ఎడమ ప్రధానకాలువ పనులను జిల్లాలో మూడు ప్యాకేజీలుగా (ఆరు, ఏడు, ఎనిమిది) చేపట్టారు. ఆరో ప్యాకేజీ పాయకరావుపేట పట్టణం తాండవ షుగర్స్ సమీపంలో మొదలై ఎస్.రాయవరం మండలం దార్లపూడి అక్విడక్టు వద్ద ముగుస్తుంది. ఏడో ప్యాకేజీ ఇక్కడి నుంచి మొదలై తాళ్లపాలెం వద్ద ముగుస్తుంది. గత టీడీపీ హయాంలో (ఏడేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి) ఆరో ప్యాకేజీలో 70 శాతం, ఏడో ప్యాకేజీలో 85 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఎనిమిదో ప్యాకేజీ ( తాళ్లపాలెం వద్ద ఏలేరు కాలువతో అనుసంధానం చేసి స్టీల్ ప్లాంట్ కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు..) పనులు ప్రారంభం కాలేదు. తరువాత గత ప్రభుత్వ హయాంలో కనీసం ఐదు శాతం పనులు కూడా పూర్తికాలేదు. పైగా చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కాలువ పనులు మళ్లీ ఊపందుకున్నాయి. ఆరో ప్యాకేజీలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో మిగిలిన వంతెనలు, అండర్ పాసేజ్‌లు, నడక వంతెనల నిర్మాణం, కాలువలో కొన్నిచోట్ల మట్టి తవ్వకం, సిమెంట్ లైనింగ్ పనులు రాత్రింబవళ్లు శరవేగంగా సాగుతున్నాయి. ఆరో ప్యాకేజీతో పోల్చుకుంటే ఏడో ప్యాకేజీలో గతంలో ఒకింత మెరుగ్గానే పనులు పూర్తయ్యాయి. ఎలమంచిలి మండల పరిధిలో కాలువ తవ్వకం, వివిధ రకాల కట్టడాల పనులు చాలావరకు పూర్తి చేశారు. కశింకోట మండలంలో గొబ్బూరు నుంచి తాళ్లపాలెం సమీపంలో ఏలేరు కాలువ వరకు పోలవరం కాలువ తవ్వకం, దార్లపూడి వద్ద అక్విడక్టుకు కాలువ అనుసంధానం, అక్కడక్కడా సిమెంట్ లైనింగ్ పనులు చేయాల్సివుంది. ఇటీవల ఈ పనులను కూడా ప్రారంభించారు. తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డులో కాలువ దాటే ప్రదేశం వద్ద భారీ పైపులు వేసి ప్రత్యామ్నాయ రహదారి నిర్మిస్తున్నారు. ఈ పైపుల ద్వారా 2,500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇది పూర్తయిన తరువాత ప్రస్తుతం వున్న రోడ్డును తొలగిస్తారు.

గొబ్బూరు గ్రామం మధ్య నుంచి పోలవరం కాలువ వెళుతున్నది. దీంతో ఇక్కడ కూడా భారీ పైపులను కాలువలో వుంచి, వాటి మీదుగా రోడ్డు వేస్తున్నారు. గొబ్బూరు నుంచి తాళ్లపాలెం వద్ద ఏలేరు కాలువ వరకు పోలవరం ప్రధాన కాలువ తవ్వకం పనులు సాగుతున్నాయి. దార్లపూడి నుంచి గొబ్బూరు వరకు కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగిస్తున్నారు. కొన్నిచోట్ల దెబ్బతిన్న సిమెంట్ లైనింగ్‌కు మరమ్మతులు, ఇంకా చిన్నాచితకా పనులు చేస్తున్నారు. చివరగా తాళ్లపాలెం వద్ద పోలవరం ఎడమ కాలువను ఏలేరు కాలువతో అనుసంధానం చేస్తారు. దీంతో వచ్చే నెలలో గోదావరి జలాలు ఎడమ కాలువ ద్వారా తాళ్లపాలెం వరకు, ఇక్కడి నుంచి ఏలేరు కాలువ ద్వారా విశాఖకు చేరతాయని అధికారులు చెబుతున్నారు.

# నయాపైసా మొక్కతో పంటలకు మేలు..

**చింతపల్లి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలో విరివిగా లభించే నయాపైసా మొక్క పచ్చిరొట్ట తరహాలో పంటలకు ఎన్నో పోషకాలు అందిస్తుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అధ్యయనంలో రుజువైంది. ఈ మొక్కల ఆకులను భూమిలో కలియదున్నుకుంటే పంటలకు అవసరమైన ఎన్నో పోషకాలు అందుతాయని చెబుతున్నారు. ఖర్చులేకుండా ఆకులను రైతులు వినియోగించడం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని స్థానిక మండల వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు తెలిపారు. గిరిజన ప్రాంత అడవులు, గ్రామాల్లో నయాపైసా మొక్కలు అధికంగా కనిపిస్తుంటాయి. ఈ మొక్కను సాధారణంగా రైతులు కంచె కోసం, పశుగ్రాసంగా వినియోగిస్తున్నారు. అయితే ఈ మొక్క ఆకుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని పచ్చిరొట్ట మాదిరిగా నయాపైసా ఆకులను వినియోగించడం మంచిదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సాగుకు ముందు రైతులు పచ్చిరొట్ట జనుము, పిల్లిపెసర, జీలుగ రకాల విత్తనాలను పంట పొలాల్లో నాటుకుని నాట్లుకు ముందుగా భూమిలో కలియదున్నుకుంటున్నారు. ఈ విధంగా చేయడం వల్ల పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు అందుతాయి. అయితే గిరిజన ప్రాంతంలో సహజసిద్ధంగా లభించే నయాపైసా మొక్కల నుంచి ఆకులతో కూడిన రెమ్మలను సేకరించి పంట పొలాల్లో ఆఖరి దుక్కిలో కలియదున్నుకోవడం వల్ల పచ్చిరొట్ట అందించే పోషకాలు పంటలకు అందుతాయి. నయాపైసా మొక్కను గ్లైరిసిడియా అని పిలుస్తారు. ఫాబేసి కుటుంబంతో పాటు లెగ్యూమ్ జాతికి చెందిన ఈ మొక్కలు మధ్యస్థంగా పెరుగుతాయి. సుమారు 33 నుంచి 38 అడుగుల ఎత్తు వరకు ఎదుగుతాయి. ఈ మొక్కల్లోని అన్ని భాగాలు బహుళ ప్రయోజనాలు అందిస్తాయి. పంటలకు కంచెగా, వంట చెరకుగా, పశువులకు మంచి పోషకాలు అందించే పశుగ్రాసంగా, పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుంది. నయాపైసా మొక్కలు భూసారాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తాయని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు గుర్తించారు. ప్రధానంగా వాతావరణంలో లభించే నత్రజనిని



భూమిలో స్థిరీకరించి భూసారాన్ని పెంచుతుంది. మన దేశంతో పాటు పలు దేశాల్లో వీటిని ప్రత్యేకంగా సాగు చేస్తున్నారు. కొందరు రైతులు అంతర పంటగాను వీటిని సాగు చేస్తున్నారు. ఈ నయాపైసా ఆకులు, రెమ్మలు పొలం ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నుకోవడం వల్ల పచ్చిరొట్ట ఎరువుగా మారుతుంది. ఈ ఎరువు ద్వారా 4 శాతం నత్రజని భూమికి అందుతుంది. ఎకరాకు ఒకటి నుంచి రెండు టన్నుల వరకు పచ్చి ఆకులను ఆఖరి దుక్కిలో కలియదున్నుకోవాలి. ఈ మొక్కల విత్తనాలు, బెరడు ఎలుకల నివారణకు ఉపయోగపడతాయి. గిరిజన ప్రాంతంలో రైతులు వర్షాధారంగా పండించే పంటలకు బాగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలను పొలాల గట్లు వద్ద పెంచుకోవడం వల్ల పర్యావరణానికి హాని కలిగించని ఎరువు లభిస్తుందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు.

## దివ్యాంగ చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** దివ్యాంగ చిన్నారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక బెహరా మనో వికాస కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న దివ్యాంగ చిన్నారుల ప్రతిభను తిలకించారు. వారు అభ్యసిస్తున్న విద్య, అందిస్తున్న ప్రత్యేక శిక్షణ, థెరపీ, కౌన్సెలింగ్ తదితర సేవలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ పిల్లలకు సమాజంలో సమాన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లల ఆడుతున్న ఆటలను, నైపుణ్యాలను పరిశీలించారు. వారి ప్రతిభను గమనించి అక్కడ ఉన్న సిబ్బందిని అభినందించారు. పిల్లలకు అందాల్సిన ప్రభుత్వ రాయితీలు పొందడంలో ఇబ్బందులు ఎదురైతే తమ సంస్థ ద్వారా తగిన న్యాయ సహాయం ఉచితంగా పొందవచ్చని సూచించారు.

## ధర్నాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతులు తప్పనిసరని విజయనగరం డీఎస్పీ రాఘవులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతులు పొందకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్షన్ 30 పోలీసు చట్టాన్ని ఆగస్టు-8 వరకూ అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం చట్ట విరుద్ధమన్నారు. చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని.. అందుకు అణుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకుని శాంతియుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు జరిపే ముందు డీఎస్పీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి సమావేశాలు, సభలు నిర్వహిస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఆర్టీసీ ప్రైవేట్‌పరం చేయం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ప్రైవేటీకరణపై జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇవన్నీ నిరాధారమైన వదంతులని, కేవలం దుష్ప్రచారం మాత్రమేనని కొట్టిపారేసింది. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఈ సందర్భంగా తేల్చిచెప్పింది. సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడం కానీ, లీజుకు ఇవ్వడం కానీ జరగదని ఆయన స్పష్టం చేశారు. సంస్థ ప్రయోజనాలతో పాటు ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ 'పీఎం ఈ-బస్ సేవా' పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంపై ప్రతిపక్షాలు, ఉద్యోగ సంఘాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ-బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గతంలో వైసీపీ నేతలు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. జాతీయ విధానంలో భాగంగా రాష్ట్రంలోని 11 నగరాల్లో 750 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, తద్వారా రాష్ట్రానికి రూ.1,774 కోట్ల ప్రోత్సాహకాలు లభిస్తాయని కృష్ణబాబు వెల్లడించారు. కొత్తగా వచ్చే ఈ బస్సులకు కూడా ఆర్టీసీ ఉద్యోగులే డ్రైవర్లుగా కొనసాగుతారని, ఎవరి ఉద్యోగానికి ఎలాంటి ముప్పు ఉండదని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగుల వేతనాలు, మహిళలకు ఉచిత ప్రయాణం (స్త్రీ శక్తి), దివ్యాంగుల రాయితీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పునరుద్ఘాటించారు. ప్రజలు అనవసర ప్రచారాలను నమ్మవద్దని, కేవలం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఆయన కోరారు.

## తిరుమలలో భారీ సర్పం... హడలిపోయిన భక్తులు!



**తిరుమల, పతాకం న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో గురువారం భారీ పాము కలకలం రేపింది. నారాయణగిరి ఉద్యానవన షెడ్ ప్రాంతంలో సుమారు 9 అడుగుల పొడవున్న జెర్రిపోతు పామును గమనించిన భక్తులు, స్థానికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు వెంటనే స్పందించారు. వన్యప్రాణులను పట్టుకోవడంలో నైపుణ్యం కలిగిన టీటీడీ ఉద్యోగి భాస్కర్ నాయుడు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన పామును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, అది అనూహ్యంగా ఆయన కాలికి చుట్టుకోవడంతో అక్కడున్న వారు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. అయితే, భాస్కర్ నాయుడు ఏమాత్రం అధైర్యపడకుండా ఎంతో చాకచక్యంగా వ్యవహరించి, ఆ పాము నుంచి విడిపించుకోవడమే కాకుండా దానిని బంధించారు. అనంతరం ఆ పామును సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. తిరుమల క్షేత్రం శేషాచలం అటవీ ప్రాంతం మధ్యలో ఉండటం వల్ల అప్పుడప్పుడు వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తుంటాయని, భక్తుల రక్షణ విషయంలో టీటీడీ యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## అమర్‌నాథ్ యాత్రకు పోటెత్తిన భక్తులు..



**జమ్మూ, కాశ్మీర్, పతాకం న్యూస్:** అమర్‌నాథ్ యాత్ర-2026కు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ ఏడాది యాత్ర ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 1.60 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర గుహలో మంచు లింగాన్ని దర్శించుకున్నారు. యాత్ర సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి 8,796 మంది యాత్రికులతో కూడిన తొమ్మిదో బృందం కశ్మీర్ లోయకు బయల్దేరింది. ఈ బృందంలో 3,350 మంది బల్తాల్ బేస్ క్యాంపునకు, మరో 5,346 మంది పహల్గామ్ బేస్ క్యాంపునకు ప్రత్యేక భద్రతా కాన్వాయ్‌ల నడుమ వెళ్లారు. యాత్రికులలో 6,426 మంది పురుషులు, 2,042 మంది మహిళలు, 228 మంది సాధువులు, 10 మంది చిన్నారులు, 33 మంది విదేశీయులతో పాటు ఒక ట్రాన్స్‌జెండర్ కూడా ఉన్నారు. మొత్తం 354 వాహనాల్లో వీరిని తరలించారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శ్రీనగర్ శివార్లలోని పంథా చౌక్ యాత్రి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గత ఏడాదితో పోలిస్తే ఈసారి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది జమ్మూకశ్మీర్ పర్యాటకానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తుంది" అని అన్నారు. యాత్రికులు జమ్మూకశ్మీర్ చేతివృత్తులు, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, ఇక్కడి కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఇది 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' స్ఫూర్తిని బలపరుస్తుందని పేర్కొన్నారు. మరోవైపు యాత్రికులకు నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై నలుగురు స్థానిక ఉపాధ్యాయులను అధికారులు సస్పెండ్ చేసి, అదుపులోకి తీసుకున్నారు. గందర్‌బల్ జిల్లాలోని మణిగామ్ ట్రాన్సిట్ క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మనోజ్ సిన్హా అధికారులను ఆదేశించారు.

# హైదరాబాదులో ప్రశ్న రావణ్ నివాసంలో ఏపీ పోలీసుల తనిఖీలు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** వివాదాస్పద యూట్యూబర్ బత్తుల జోసెఫ్ అలియాస్ 'ప్రశ్న రావణ్' నివాసంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ శివార్లలోని అమీన్‌పూర్‌లో గల ఆయన నివాసంలో గన్నవరం పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. గంటల తరబడి సాగిన ఈ సోదాల్లో కొన్ని కీలక పత్రాలు, రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గన్నవరం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎనిమిది మంది అధికారుల బృందం ఈ ఆపరేషన్‌లో పాల్గొంది. సోదాల అనంతరం రావణ్ భార్యను విచారించిన పోలీసులు, ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తనిఖీ ప్రక్రియ మొత్తాన్ని వీడియో చిత్రీకరించారు. ఈ ఆపరేషన్‌లో స్థానిక పోలీసులు భద్రతతో పాటు ఇతర సహాయ సహకారాలను అందించారు. గత రెండేళ్లుగా అమీన్‌పూర్‌లోని నరేంద్ర నగర్ కాలనీలో రావణ్ నివసిస్తున్నారు. విద్వేషపూరిత వ్యాఖ్యలు, ఇతర తీవ్ర ఆరోపణలకు సంబంధించి ఆయనపై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల దర్యాప్తులో భాగంగానే పోలీసులు ఈ సోదాలు నిర్వహించారు. కాగా, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద గన్నవరం పోలీసులు ఇటీవల రావణ్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించిన సంగతి తెలిసిందే.

# జలాశయంలోకి వివాహిత ఆత్మహత్య



**పార్వతీపురం, పతాకం న్యూస్:** నందిని(26), విశ్వనాథపురం గ్రామానికి చెందిన తెర్లింగి సతీష్ పదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసున్నారు. వీరికి ఇద్దరు అబ్బాయిలు. నందిని పి.కోనవలస గిరిజన బాలికల కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. సతీష్ ఆటో డ్రైవర్. మద్యానికి బానిసఅయ్యాడు. భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. గురువారం మధ్యాహ్నం విధులు ముగించుకున్న నందిని పెద్దగెడ్డ జలాశయం వద్దకు వచ్చింది. అక్కడి నుంచి భర్తకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పింది. భర్త ఫోన్‌లోనే వద్దని వారించాడు. హుటాహుటిన జలాశయం వద్దకు చేరుకున్నాడు. భర్త వచ్చాక చివరిచూపు చూసిన నందిని జలాశయంలోకి దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు జలాశయంలో నందిని కోసం గాలింపు చేపట్టారు. చీకటిపడినా అచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ అర్జున తెలిపారు. భర్త వేధింపుల వల్లే నందిని జలాశయంలో దూకినట్లు ఆమె సోదరుడు, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# మార్కెట్ కమిటీల బలోపేతమే లక్ష్యం



**నరసన్నపేట, పతాకం న్యూస్:** వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు స్థానిక రైతులకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయంగా మార్కెట్ కమిటీలను బలోపేతం చేస్తున్నట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.49లక్షలతో అంతర్గత రోడ్లు, ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా కాపాడేందుకు, రైతుల సరకులకు భద్రత కల్పించేవిధంగా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. దళారీ వ్యవస్థలను నిర్మూలించి పారదర్శకమైన వ్యాపార వాతావరణాన్ని సృష్టించేందుకు మార్కెట్ కమిటీలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పాగోటి ఉమామహేశ్వరి, నరసన్నపేట, పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, ఎంవీ నాయుడు, పోలాకి, నరసన్నపేట పీఏసీఎస్ అధ్యక్షులు బైరి భాస్కరరావు, ఇసా అప్పారావు, కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరావు, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, సాసుపల్లి కృష్ణబాబు, బలగ ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణానికి చెందిన యువశాస్త్రవేత్త ఎం.భానుచందర్‌ను అభినందించారు.

# విజయ్ ప్రభుత్వానికి భారీ ఊరట!

**చెన్నై, పతాకం న్యూస్:** విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగ పత్రాల పంపిణీకి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగ నియామకాలు కేవలం 'తాత్కాలికం' మాత్రమేనని న్యాయస్థానం మెలిక పెట్టింది. భవిష్యత్తులో తుది తీర్పుకు లోబడి ఈ నియామకాలు ఉంటాయని స్పష్టం చేసింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్ శక్తివేల్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ధర్మాసనం.. ప్రభుత్వం ఈ ఉద్యోగాలు ఇవ్వడానికి అనుసరించిన మార్గదర్శకాలు ఏమిటి?.. బాధితుల కుటుంబాలకు ఆ అర్హతలు ఉన్నాయా లేదా? అనే విషయాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి స్పష్టమైన పాలసీ లేకుండా.. విపత్తు బాధితులకు ఉద్యోగాలు కేటాయించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు) పరిధిలోకి వస్తుందో లేదో సమీక్షిస్తామని పేర్కొంది.

# బీహార్‌లో నకిలీ సర్టిఫికెట్లతో కొలువులు పొందిన 3,035 మంది ఉపాధ్యాయుల తొలగింపు!



**బీహార్, పతాకం న్యూస్:** బీహార్ విద్యాశాఖ రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. నకిలీ పట్టాలు, ఫోర్జరీ చేసిన విద్యా ధ్రువీకరణ పత్రాలను సమర్పించి మోసపూరితంగా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సంపాదించిన 3,035 మంది టీచర్లను విధుల్లోంచి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. 2006 నుండి 2015 మధ్య కాలంలో జరిగిన ఉపాధ్యాయుల నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ బ్యూరో గత కొంతకాలంగా లోతైన దర్యాప్తు చేపట్టింది. ఈ సుదీర్ఘ విచారణ ముగిసిన తర్వాత విజిలెన్స్ బ్యూరో సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ భారీ చర్యలకు విద్యాశాఖ పూనుకుంది. ఈ విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. చాలామంది అభ్యర్థులు ఉనికిలో లేని నకిలీ కాలేజీల సర్టిఫికెట్లను సృష్టించగా, మరికొందరు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేసి ప్రభుత్వ కొలువులు దక్కించుకున్నారు. ఈ కుంభకోణంలో నిందితులుగా తేలిన 3,035 మంది ఉపాధ్యాయులపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 1,830 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కేవలం ఉద్యోగాల నుండి తొలగించడమే కాకుండా, వీరు సర్వీసులో ఉన్న కాలంలో ప్రభుత్వం నుండి పొందిన జీతభత్యాలు, గౌరవ వేతనాలను కూడా వడ్డీతో సహా తిరిగి వసూలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. అధికారికంగా వారిని విధుల్లోంచి తొలగించిన వెంటనే ఈ రికవరీ ప్రక్రియ ప్రారంభం కానుంది. విజిలెన్స్ విచారణ తీవ్రరూపం దాల్చడంతో, కొందరు ఉపాధ్యాయులు శాఖాపరమైన చర్యల నుండి తప్పించుకోవడానికి ముందే తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. అయితే, రాజీనామా చేసినంత మాత్రాన వారు చట్టపరమైన విచారణ నుండి తప్పించుకోలేరని, మోసపూరిత మార్గాల్లో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరిపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. విద్యా నియామకాల్లో పారదర్శకతను పెంచడానికి, ఏళ్ల తరబడి వ్యవస్థను పట్టిపీడిస్తున్న అక్రమాలను అంతమొందించి ప్రభుత్వ విద్యావ్యవస్థపై ప్రజల్లో మళ్లీ నమ్మకాన్ని పునరుద్ధరించడానికే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రసవానంతరం మహిళలకు ఏయే సమస్యలు ఉంటాయి?

ప్రసవం తర్వాత మహిళ శరీరం పూర్తిగా కోలుకోవడానికి, అలాగే శిశువుకు తల్లిపాలు అందించడానికి సరైన పోషకాహారం అత్యంత కీలకం. గర్భధారణ సమయంలో పోషకాహారంపై ఎంత శ్రద్ధ అవసరమో, ప్రసవానంతరం కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దశలో సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీర పునరుద్ధరణ వేగవంతమవడంతోపాటు శక్తి పెరుగుతుంది, తల్లిపాల ఉత్పత్తికి కూడా మేలు జరుగుతుంది. ప్రసవం తర్వాత శరీరం తీవ్రమైన శారీరక ఒత్తిడిని ఎదుర్కొంటుంది. సాధారణ ప్రసవమైనా, సిజేరియన్ అయినా శరీరానికి కోలుకునే సమయం అవసరం. ఈ సమయంలో ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల కండరాల పునరుద్ధరణ, గాయాలు త్వరగా మానడం, శరీర కణజాలం మరమ్మత్తు కావడంలో సహాయపడుతుంది. గుడ్లు, పనీర్, పప్పులు, టోఫూ, చికెన్ వంటి ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చుకోవడం మంచిది. ప్రసవ సమయంలో రక్తనష్టం జరగడం వల్ల ఐరన్ లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే శరీరంలోని ఐరన్ నిల్వలను పునరుద్ధరించేందుకు పాలకూర, బీట్‌రూట్, బెల్లం, ఖర్జూరం, లీన్ మీట్ వంటి ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారాలను తీసుకోవాలి. దీంతో రక్తహీనత ప్రమాదం కూడా తగ్గుతుంది. మంచి కొవ్వులు (హెల్తీ ఫ్యాట్స్) కూడా ప్రసవానంతర పోషకాహారంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. డ్రై ఫ్రూట్స్, గింజలు, విత్తనాలు వంటి ఆహారాల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా హార్మోన్ల



సమతుల్యతకు కూడా తోడ్పడతాయి. అలాగే ఎముకల ఆరోగ్యానికి పెరుగు, పాలు, నువ్వులు, రాగి వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ప్రసవం తర్వాత, ముఖ్యంగా తల్లిపాలు ఇస్తున్న మహిళలకు తగినంత నీరు తాగడం చాలా అవసరం. శరీరంలో ప్రతి కణం సక్రమంగా పనిచేయడానికి, జీర్ణక్రియ మెరుగు పడడానికి, తల్లిపాల ఉత్పత్తి సక్రమంగా సాగడానికి హైడ్రేషన్ కీలకం. రోజుకు సుమారు 2.5 నుంచి 3 లీటర్ల వరకు ద్రవాలు తీసుకోవాలి. సాధారణ నీటితోపాటు కొబ్బరి నీరు, మజ్జిగ, చికెన్ సూప్, పప్పు సూప్ వంటి పోషక విలువలు కలిగిన ద్రవాలను కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. ప్రసవానంతరం రోజుకు మూడు పెద్ద భోజనాల కంటే తక్కువ మోతాదులో తరచూ ఆహారం తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరానికి నిరంతరం శక్తి అందుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా తగ్గిపోవడాన్ని నివారించవచ్చు. దీంతో ప్రసవానంతర అలసట కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో ప్రాసెస్ చేసిన స్నాక్స్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, అధిక కాఫీ, మద్యం వంటి వాటిని వీలైనంత వరకు తగ్గించాలి. వీటి బదులుగా తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది.

ఫైబర్ తక్కువగా తీసుకుంటే మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. సాంప్రదాయ ఆహారాల్లో అజ్వైన్ (వాము), మెంతులు, జీలకర్ర, గోండ్ వంటి పదార్థాలు కూడా ప్రసవానంతర కాలంలో ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపర చడంతోపాటు కడుపు ఉబ్బరం తగ్గించడంలో సహాయపడతాయి. గోండ్ లడ్డూలు, వాము నీరు, మెంతులతో చేసిన వంటకాలు ప్రసవం తర్వాత కోలుకునే ప్రక్రియకు తోడ్పడతాయి. అంటువ్యాధులు సంక్రమించకుండా: ప్రసవానంతరం మహిళలలో రోగ నిరోధక శక్తి తత్వాలు తక్కువగా ఉంటాయి. కావున అత్యంత జాగరూతులై వ్యవహరించవలసిన అవసరం ఉన్నది. లేని పక్షంలో అనేక అంటువ్యాధులకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. మీ ఆహార ప్రణాళికలలో భాగంగా అత్యధికంగా విటమిన్-- సి ని చేర్చుకోవలసిన అవసరం ఉంది. విటమిన్-సి శరీరంలో రోగ నిరోధక శక్తి తత్వాలను పెంచుటలో తద్వారా శరీరాన్ని ఆరోగ్యకరంగా చేయడంలో ఎంతో సహాయం చేస్తుంది . మిగిలిన ఆహార పదార్థాలైన బ్రోకోలి, బంగాళా దుంపలు, నిమ్మజాతి కి చెందిన పండ్లు, టొమాటోలు మొదలైన వాటి నుండి విటమిన్ --సి ని పొందవచ్చు.

# అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లు

## అధ్వానంగా మరుగుదొడ్లు.. వసతుల కల్పనపై దృష్టిసారించని అధికారులు.. ప్రయాణికులకు తప్పని అవస్థలు

**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లు అధ్వానంగా మారాయి. సమస్యలకు నిలయాలుగా మారాయి. అసౌకర్యా లతో ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. రన్నింగ్ వాటర్ లేక పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు వినియోగానికి నోచడం లేదు. ప్రజలకు సురక్షిత నీరు కూడా అందడం లేదు. మరోవైపు కాంప్లెక్స్ పరిసరాల్లో పారిశుధ్యం క్షీణించినా పట్టించుకునే వారే కరువయ్యారు. మొత్తంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించకపోవడం.. ప్రయాణికులకు శాపంగా మారింది. పార్వతీపురం నుంచి రోజూ విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నంతోపాటు ఇతర జిల్లాలకు సుమారు 20 వేల నుంచి 25 వేల మంది ప్రయణిస్తుంటారు. అయితే కాంప్లెక్స్‌లో అసౌకర్యాలు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కాగా 40 ఏళ్ల కిందట నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రయాణికులకు తగ్గట్టుగా కుర్చీలు ఏర్పాటు చేయలేదు. దీంతో గంటలకొద్దీ ప్రజలు నిల్చొనే బస్సులు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో పారిశుధ్యం లోపించింది. చెత్తా చెదారం, మురుగునీరు దర్శనమిస్తున్నా.. సంబం?ధిత అధికారులు స్పందించడం లేదు. మరోవైపు కాంప్లెక్స్‌లో మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. శుద్ధ తాగునీరు పేరుకే తప్పా, సం బంధిత ట్యాంకులను నెలకొకసారైన శుభ్రం చేయడ లేదు. మొత్తంగా కాంప్లెక్స్‌లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. డివిజన్ కేంద్రం పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తాగునీటి కుళాయిలు ఉన్నప్పటికీ సురక్షితమైన నీరు రావడం లేదు. దీంతో ప్రయాణికులు వాటిని వినియోగించడం లేదు. రన్నింగ్ వాటర్ లేకపోవడంతో ఇక్కడున్న మూడు సామూహిక మరుగుదొడ్లలో రెండు మూతపడ్డాయి. మరొక మరుగుదొడ్డి అందుబాటులో ఉన్నప్పటికీ ప్రయాణికులు కొంత మొత్తం చెల్లించాల్సి వస్తోంది. రాత్రివేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఇంక అంతే సంగతి. ఇన్వర్టర్ సదుపాయం లేకపోవడంతో కాంప్లెక్స్‌లో ప్రయాణికులు చీకట్లోనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. కాంప్లెక్స్ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోగా.. మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం దుర్వాసన వెలువడుతుండడంతో ముక్కుమూసుకుని బస్సుల కోసం పరీక్షించాల్సి వస్తోంది. సాలూరు ఆర్టీసీ డిపోలో 59 ప్రభుత్వ , 21 అద్దె బస్సులు ఉన్నాయి. కాంప్లెక్స్ నుంచి నిత్యం విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖతో పాటు పలు పల్లెలకు బస్సులు నడుపుతున్నారు. ఆదాయంలో జిల్లాలోనే సాలూరు డిపో ప్రథమ స్థానంలో ఉంది. అయితే కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సురక్షిత నీరు అందడం లేదు. ట్యాంకును సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో ఇక్కడున్న కుళాయి నీటిని ఎవరూ వినియోగిం చలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో మరుగుదొడ్లను పాడు చేస్తున్నారనే కారణంతో ఇన్‌గేట్ సమీపంలో ఉన్న వాటికి తాళాలు వేశారు. ఇకపోతే రహదారి సౌకర్యం ఉన్నా మారుమూల గిరిజన గ్రామాలకు సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు వెళ్లకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



## ఇరాన్‌పై మూడో రోజూ దాడులు.. అణు విద్యుత్ కేంద్రం సమీపంలో పేలుళ్లు



**ఇరాన్:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఘర్షణ వాతావరణం మరింత తీవ్రరూపం దాల్చుతోంది. వరుసగా మూడో రోజు కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడులతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించాయి. కీలకమైన బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంతోపాటు బందర్ అబ్బాస్, కొనారక్ వంటి తీర ప్రాంతాలు ఈ దాడులతో దద్దరిల్లాయి. ఇవి అమెరికా సైన్యం జరిపిన దాడులేనని ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ఈ దాడుల ప్రభావంతో బుషెహర్ అణు కేంద్రంలోని ఒక భవనం పాక్షికంగా దెబ్బతిన్నట్లు సమాచారం అందుతోంది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపిస్తూ అమెరికా ఈ దాడులు చేపట్టింది. కాల్పుల విరమణ ఒప్పందం "ముగిసిపోయింది" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలోనే ప్రకటించిన విషయం విదితమే. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీర ప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది.

## చైనాలో ఘోర అగ్నిప్రమాదం.. షూ ఫ్యాక్టరీలో 28 మంది సజీవ దహనం

**చైనా:** చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.




## వైభవ్ కోసం సంజూను పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదు: పార్థివ్ పటేల్



భారత టీ20 జట్టు వరుస పరాజయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అయితే టీ20 ప్రపంచ కప్ 2026 హీరో సంజు శాంసన్‌ను పక్కన పెట్టడంపై చర్చ కొనసాగుతూనే ఉంది. యువ బ్యాటర్ వైభవ్ సూర్యంశీ కోసం సంజును తప్పించారనే విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు భారీ అంచనాలతో బరిలోకి దిగిన వైభవ్.. ఆడిన మూడు మ్యాచుల్లోనూ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాడు. దీంతో సంజును తప్పించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ ఈ విషయంపై మాట్లాడాడు. 'గత 11-12 ఏళ్లుగా సంజు శాంసన్ కెరీర్‌ను చూస్తే అతడిని వెంటాడిన ఒకే ఒక్క ప్రశ్న నిలకడ. గతంలో అతడి అస్థిర ప్రదర్శనల కారణంగా జట్టుకు దూరమయ్యాడు. కానీ ఇప్పుడు ఎందుకు సంజునే పక్కన పెట్టారనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వడం ఒక రకంగా సరైన నిర్ణయం కావచ్చు. అయితే పూర్తిగా తార్కికంగా చూస్తే సంజు శాంసన్‌ను ఎందుకు తప్పించారో అర్థం కావడం లేదు. వైభవ్ కోసం సంజును పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదు. జట్టులో లేని ఆటగాడే మెరుగ్గా ఆడేవాడని మనం ఎప్పుడూ భావిస్తుంటాం. గత టీ20 ప్రపంచ కప్ సమయంలో శ్రేయస్ అయ్యర్ లేకపోవడంతో అతడినే కోరారు. ఇప్పుడు అతడు జట్టులోకి రాగానే ఆర్సీబీకి రెండుసార్లు కప్ అందించిన కెప్టెన్ రజత్ పాటీదార్‌కు అవకాశం ఇవ్వాలని అంటున్నారు. ఇలాంటి చర్చలు ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటాయి' అని పార్థివ్ పటేల్ వెల్లడించాడు. ఇదిలా ఉంటే, ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను ఓ మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ కోల్పోయింది. ఒక మ్యాచ్ రద్దు కాగా, మూడు మ్యాచుల్లో ఘోర ఓటమిపాలైంది. నామమాత్రపు ఐదో టీ20 జులై 11న జరగనుంది.

## నాలుగో టీ20లో ఇంగ్లాండ్ గెలుపు..

# టీమిండియా చేజారిన సిరీస్



ఐర్లాండ్‌తోనే కాదు.. ఇంగ్లండ్ పర్యటనలోనూ టీమిండియాకు చేదు అనుభవమే ఎదురైంది. కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లోనూ మనోళ్ల తీరు మారలేదు. కెప్టెన్ శ్రేయాస్ (49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 80 నాటౌట్) మినహా బ్యాటింగ్‌లో ఎవరూ రాణించకపోగా.. బౌలర్లు అయితే పూర్తిగా తేలిపోయారు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 79 నాటౌట్), ఓపెనర్ ఫిల్ సాల్ట్ (42 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 59 నాటౌట్).. బౌలర్లను అలవోకగా ఆడేయడంతో నాలుగో టీ20లో ఇంగ్లండ్ 9 వికెట్లతో ఘనవిజయం సాధించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇంకో మ్యాచ్ ఉండగానే 3-0 ఆధిక్యం అందుకుంది. ఈ ఫార్మాట్‌లో భారత్‌పై ఇంగ్లండ్‌కిదే తొలి సిరీస్ కావడం విశేషం. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. ఆఖరిదైన ఐదో టీ20 శనివారం జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. శివమ్ దూబే (23 బంతుల్లో 2 ఫోర్లతో 22) ఫర్వాలేదనిపించాడు. ఆర్చర్, టంగ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ 13.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 159 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా బ్రూక్ నిలిచాడు. ఓ మాదిరి ఛేదనలో కెప్టెన్ హ్యారీ బ్రూక్, ఓపెనర్ ఫిల్ సాల్ట్ అదరగొట్టారు. జోస్ బట్లర్ (8) మూడో ఓవర్‌లోనే వెనుదిరగడంతో ఇంగ్లండ్‌కు సైతం తిప్పలు తప్పవేమో అనిపించింది. కానీ బ్రూక్ రాకతో మ్యాచ్ స్వరూపమే మారింది. ఇక ఆ తర్వాత బ్రూక్ హవా సాగింది. మరో 37 బంతులుండగానే ఈ జోడీ మ్యాచ్‌ను ముగించింది. అలాగే రెండో వికెట్‌కు అజేయంగా 146 పరుగులు జత చేయడం విశేషం.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఈసారీ శుభారంభం దక్కలేదు. కానీ కెప్టెన్ శ్రేయాస్ నిలకడైన ఆటతీరుతో జట్టు గౌరవప్రదమైన స్కోరందుకుంది. ఆరంభంలో పేసర్ల బౌన్సీ బంతులకు టాపార్డర్ తడబడింది. ఓపెనర్ వైభవ్ (15) మరోసారి పేసర్ ఆర్చర్‌కు దొరికిపోగా, ఇషాన్ (4)ను టంగ్ అవుట్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 44/2 స్కోరుతో నిలిచింది. ఏడో ఓవర్‌లో ఓపెనర్ అభిషేక్ (16)కూడా వెనుదిరగడంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది. ఈ దశలో శ్రేయాస్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. బౌలర్లను స్వేచ్ఛగా ఆడుతూ ముందుకు సాగాడు. అతడికి దూబే సహకరించడంతో నాలుగో వికెట్‌కు 53 పరుగులు జత చేరాయి. స్వల్ప వ్యవధిలో దూబే, తిలక్ (11) వెనుదిరిగినా శ్రేయాస్ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 18వ ఓవర్‌లో శ్రేయాస్ 6,4,6తో 20 పరుగులు రాబట్టడంతో స్కోరు 150కి చేరింది. కానీ చివరి రెండు ఓవర్లలో పేసర్లు కర్రాన్, ఆర్చర్ కేవలం 8 పరుగులే ఇచ్చి భారత్‌ను కట్టడి చేశారు.




# ‘మైసా’ కోసం రష్మిక సాహసం.. అండర్‌వాటర్‌లో భారీ ఫైట్!




ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న తన తదుపరి చిత్రం ‘మైసా’ కోసం ఒక అరుదైన సాహసాన్ని ప్రదర్శించారు. భారతీయ చలనచిత్ర చరిత్రలో తొలిసారిగా ఒక కథానాయిక నీటి అడుగున భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేయడం విశేషం. ఈ ఉత్కంఠభరిత ఘట్టాన్ని ఎటువంటి డూప్ సహాయం తీసుకోకుండా రష్మిక స్వయంగా పూర్తిచేయడం గమనార్హం. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్‌ను పంచుకున్నారు. “నా కెరీర్‌లో ఇంతకంటే సవాలుతో కూడిన పని ఇప్పటివరకు చేయలేదు. ఈ చిత్రం కోసం మేం ఎంతో శ్రమిస్తున్నాం, ఇదే నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది” అని పేర్కొంటూ స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న ఒక చిత్రాన్ని షేర్ చేశారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 20 గంటల పాటు నీటి అడుగున ఈ హై-ఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించినట్లు చిత్ర బృందం వెల్లడించింది.

రవీంద్ర పుల్ల దర్శకత్వంలో ‘మైసా’ చిత్రం ఒక ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. గిరిజన నేపథ్యంతో సాగే ఈ కథలో రష్మిక ఒక గోండు గిరిజన యువతిగా అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. “భారతీయ యాక్షన్ సినిమాలలో ఇది ఒక నూతన అధ్యాయం” అని చిత్ర నిర్మాణ సంస్థ అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పేర్కొంది. ఈ విశిష్ట పాత్ర కోసం రష్మిక బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా స్టంట్ శిక్షణ కూడా పొందారు. ఈ సినిమా టీజర్ అప్‌డేట్‌ను త్వరలోనే వెల్లడించనున్నట్లు, ఈ ఏడాదే చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

# ‘సాయిరా బాను’ తొలి షెడ్యూల్ పూర్తి



యువ కథానాయకుడు ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘సాయిరా బాను’ తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే హైదరాబాద్‌లో 15 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్‌ను చిత్ర యూనిట్ విజయవంతంగా ముగించింది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ప్రత్యేకంగా నిర్మించిన సాఫ్ట్‌వేర్ ఆఫీస్ సెట్‌లో హీరో ఆది సాయికుమార్, కథానాయిక బాంధవి శ్రీధర్, ప్రముఖ హాస్య నటుడు వెన్నెల కిషోర్‌లపై పలు కీలకమైన, వినోదాత్మక సన్నివేశాలను చిత్రీకరించారు. తొలి షెడ్యూల్ పూర్తయిన సందర్భంగా, సెట్స్‌లోని సందడిని మరియు సరదా వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఒక ‘బిహైండ్ ది సీన్స్’ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఒక హిందూ యువకుడు, ముస్లిం యువతి మధ్య సాగే వైవిధ్యభరితమైన ప్రేమకథా చిత్రంగా ఇది రూపొందుతోంది. హైదరాబాద్, రాజమండ్రి నగరాల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఇటీవలే ‘కె-రాంప్’ చిత్రంతో విజయాన్ని అందుకున్న నిర్మాత రాజేష్ దండ, హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ‘శ్యామ్‌భళ’ వంటి విజయం తర్వాత ఆది సాయికుమార్.. వాణిజ్య అంశాలతో కూడిన విభిన్న కథాంశాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు.

# 24న ‘జన నాయగన్’?



తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ చివరి చిత్రం ‘జన నాయగన్’ విడుదలకు ఎదురైన ప్రధాన ఆటంకాలు తొలగిపోయాయి. పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం తాజాగా సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ జారీ చేయడంతో, విడుదలకు మార్గం సుగమమైంది. ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా నిడివి 183 నిమిషాలుగా (3 గంటల 3 నిమిషాలు) ఖరారైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించగా, మమితా బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమైన ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. జూలై 24న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నిజానికి ఈ సినిమాను 2026 జనవరి 9న సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని తొలుత భావించారు. అయితే, సెన్సార్ సమస్యలు, న్యాయపరమైన చిక్కులు, సీబీఎఫ్‌సీ రివైజింగ్ కమిటీ సమీక్ష వంటి కారణాల వల్ల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. చిత్రంలో కొన్ని మార్పుల చేసిన అనంతరం బోర్డు ఈ సినిమాకు ‘ఏ’ రేటింగ్ కేటాయించినట్లు సమాచారం.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**